క్లుప్తంగా

అపరిచితుల కదలికలపై ప్రత్యేక దృష్టి

సాక్షి ఎఫెక్ట్..

జోగుళాంబ శక్తిపీఠం: 'అపరిచితులపై నిఘా ఏదీ' అంటూ 'సాక్షి' దినపత్రికలో గురువారం వచ్చిన కథనంపై స్థానిక ఎస్‌ఐ నాగరాజు స్పందించారు. కొత్త వ్యక్తులు ఎవరెవరూ ఇక్కడికి వస్తున్నారు. ఎంతకాలంగా వస్తున్నారు, నిజంగా ఆలయం దర్శనం కోసమే వస్తున్నారా లేక ఇతర కార్యకలాపాలు ఏదేని చేపడుతున్నారా? అనే అంశం పై ఆరా తీశారు. 'సాక్షి' కథనంపై పట్టణంలో చర్చానీయాంశం మొదలైంది.

జోగుళాంబ సన్నిధిలో ఆర్డీఓ



జోగుళాంబ శక్తిపీఠం: అష్టాదశ శక్తిపీఠాలలో ఐదో శక్తిపీఠం అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయాన్ని గురువారం గద్వాల ఆర్డీఓ మాలోతు రాములునాయక్ దర్శించుకున్నారు. గద్వాల ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టే ముందు జోగుళాంబ తల్లి ఆశీస్సులు పొందేందుకు ఆలయానికి వచ్చినట్టు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి తీర్థ, ప్రసాదాలు అందజేసి వేద ఆశీర్వచనం చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

అలంపూర్: విద్యుత్ మరమ్మతుల కోసం శుక్రవారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏడీఈ మహ్మద్ చిన్న మక్బుల్ బాషా ఒక ప్రకటనలో తెలిపారు. అలంపూర్ నియోజకవర్గంలోని అలంపూర్ చౌరస్తా నుంచి వడ్డేపల్లి మండలం, ఉండవెల్లి మండలం, ఇటిక్యాల మండలాల్లో పలు చోట్ల ఫీడర్ల మరమ్మతులు చేయించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఒరిగిన విద్యుత్ స్తంభాలను సరిచేయడం జరుగుతుందని తెలిపారు. పుల్లూరు ఫీడరు, చాగాపురం ఫీడరు, శాంతినగర్ ఫీడర్లకు మరమ్మతులు చేస్తారని, ప్రజలు, అధికారులు సహకరించాలని తెలిపారు.

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలంలోని చాగాపురం 11కేవీ ఫీడర్‌లో విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో శుక్రవారం పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ వెంకట్రావ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని చాగాపురం, బట్లదిన్నె, వల్లూరు గ్రామాలకు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు, రైతులు దీనిని గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

నర్సరీ పరిశీలన

మానవపాడు: మండల కేంద్రంలోని నర్సరీని గురువారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి పరిశీలించారు. నర్సరీలోని సిబ్బందికి పలు, సూచనలు సలహాలు ఇచ్చారు. గ్రామంలోని నీటి సమస్యలపై కార్యదర్శులతో చర్చించారు. గ్రామలోని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చాడాలని సిబ్బందిని ఆదేశించారు. గ్రామంలోని మురుగు కాల్వలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. గ్రామాల్లోని పారిశుద్ధ్య కార్మికులు మురుగు, చెత్తా చెదారాలు, తడి, పొడి చెత్తను వేరు చేయాలని తెలిపారు.

బాలుడి ప్రాణాన్ని కాపాడిన ఏఎన్‌ఎం

గట్టు: రోడ్డు పక్కన పడిపోయిన బాలుడికి సీపీఆర్ చేసి, ప్రాణాలను కాపాడింది ఆలూరు ఏఎన్‌ఎం భారతి. మండల కేంద్రానికి చెందిన పలువురు విద్యార్థులు ఈతకోసం రాయాపురం స్టేజీ సమీపంలోని బావి దగ్గరకు వెళ్లారు. అయితే తిరుగు ప్రయాణంలో విద్యార్థులు ఆటోలో వస్తున్న క్రమంలో రాయాపురం స్టేజీ సమీపంలో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కన పడడంతో అందులోని చిన్నారులు భయంతో పరుగులు తీశారు. అందులోని మల్లేష్ అనే బాలుడు రోడ్డు పక్కనే భయంతో స్పృహ తప్పి పడిపోయాడు. అక్కడున్న వారంతా బాలుడు చనిపోయాడని భావించారు. అయితే ఆలూరుకు చెందిన ఏఎన్‌ఎం భారతి అటుగా వెళ్తూ, రోడ్డు పక్కన పడి ఉన్న బాలుడిని గుర్తించి, సీపీఆర్ చేసింది. దీంతో బాలుడు ఊపిరి పీల్చుకోవడంతో హుటాహుటిన బాలుడిని గట్టు ఆస్పత్రికి తీసుకెళ్లి, అక్కడి నుంచి గద్వాలకు తరలించారు. ప్రస్తుతం ఆ బాలుడు గద్వాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు వైద్య సిబ్బంది తెలిపారు. సకాలంలో స్పందించి సీపీఆర్ చేసిన ఏఎన్‌ఎం భారతిని వైద్య సిబ్బందితో పాటుగా గ్రామస్తులు అభినందించారు.

మద్యం పట్టివేత

గద్వాల క్రైం: అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ రెండో ఎస్‌ఐ రాము తెలిపారు. గద్వాల మండలం చెనుగోనిపల్లిలో వెంకటేశ్వర్లు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు గురువారం సాయంత్రం సమాచారం రావడంతో సిబ్బంది సహాయంతో సదరు వ్యక్తి ఇంట్లో సోదాలు చేయగా, 9 లీటర్ల మద్యం గుర్తించి సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు. మద్యం విలువ రూ.9 వేలు ఉంటుందని తెలిపారు.

భద్రతపై మూడోకన్ను

- పల్లెల్లో నిఘా నేత్రాల ఏర్పాటు
- సీసీ కెమెరాలతో పెరగనున్న భద్రత
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న పోలీసులు
- విరాళాల సేకరణతో స్వచ్ఛందంగా ఏర్పాటు
- దాతలు ముందుకొస్తే మరింత అభివృద్ధి



సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్పీ రితిరాజ్(ఫైల్)

ఎర్రవల్లిచౌరస్తా: ఒక్క సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని పోలీసులు చేస్తున్న ప్రచారం రోజురోజుకు సత్ఫలితాలను ఇస్తోంది. పల్లెల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ఇప్పుడిప్పుడే ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో మొదటగా కొన్ని పంచాయతీల్లో అక్కడక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో దాతల సహకారంతో నిధులను సేకరించి గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో, జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని ఏర్పాటు చేయడం ద్వారా పల్లెల్లో నేరాల నియంత్రణకు ఎంతగానో దోహదపడుతున్నాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు పల్లెల్లో నిరంతరంగా నిఘా సైతం ఏర్పడుతోందని ప్రజలు తెలుపుతున్నారు. గ్రామాలకు ఎవరైనా అపరిచిత వ్యక్తులు వచ్చినా, వారి కదలికలు సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించేందుకు ఎంతో వీలుంటుందని పలువురు తెలుపుతున్నారు.

ముమ్మరంగా పోలీసుల ప్రచారం..

ఎస్పీ ఆదేశాల మేరకు అలంపూర్ నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల గ్రామాల్లో కలిగే ప్రయోజనాలపై గ్రామస్తులకు విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. గ్రామంలోని ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కలిసి దాతల సహాయంతో ప్రధాన కూడళ్లతో పాటు జన సంచారం ఉండే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. నియోజకవర్గంలో 124 మండలాలు ఉండగా, ఇప్పటికే 53 పంచాయతీల్లో దాతలు, వివిధ గ్రామ సంఘాలు విరాళాలు అందించడంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 27 జీపీల్లో దాతలు ముందుకు రావడంతో సీసీ కెమెరాల ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మిగిలిన 44 జీపీల్లో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

శాంతి భద్రతల కోసం..

శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఆయా గ్రామాల్లో వివిధ షాపుల యజమానులు, ప్రజా ప్రతినిధులు, దాతలు, గ్రామస్తులు ముందుకు వస్తున్నారు. ఇటీవల కోదండాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పల్లెపాడు లో భద్రత కోసం గ్రామస్తులంతా ఏకమై సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నారు. గ్రామ రైతు సంఘం ద్వారా రూ.3.50లక్షల వరకు ఖర్చుచేసి ప్రధాన కూడళ్లు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాల్లో 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈనెల 18న రైతు సంఘం ఆధ్వర్యంలో ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించగా ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ రితిరాజ్ హాజరై సీసీ కెమెరాలను ప్రారంభించారు. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే గ్రామంలో నేరాలు తగ్గడంతో పాటుగా భద్రత పెరుగుతుందని ఎస్పీ సూచించారు.

నేరాలు తగ్గుముఖం..

గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుతో నిరంతరం పర్యవేక్షణకు వీలుంటుంది. గ్రామాల్లో నిత్యం అనవసరంగా జరిగే చిన్న చిన్న నేరాలు తగ్గుముఖం పట్టేందుకు అవకాశం ఉంటుంది. ప్రస్తుతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్న గ్రామాలను ఆదర్శంగా తీసుకొని మిగతా గ్రామాల ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఎస్పీ రితిరాజ్‌తో పాటుగా స్థానిక పోలీసులు కోరుతున్నారు.



ఎర్రవల్లి కూడలిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

మండలం	జీపీలు	కెమెరాల ఏర్పాటు	కొనసాగుతున్న పనులు
ఇటిక్యాల	29	13	07
మానవపాడు	16	06	04
అలంపూర్	14	05	03
ఉండవెల్లి	16	07	02
రాజోళి	11	06	03
వడ్డేపల్లి	10	05	02
అయిజ	28	11	06

గ్రామస్తుల చొరవతో ఏర్పాటు చేశాం..



పోలీసుల విజ్ఞప్తి మేరకు వ్యాపారులు, గ్రామస్తులు అందరూ కలిసి విరాళాలు అందించడంతో గ్రామ పంచాయతీలో అక్కడక్కడ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశాం. గ్రామంలోని ప్రధాన కూడళితో పాటు జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలతో ఎక్కడ ఏం జరుగుతుందో నేరుగా వీక్షించవచ్చు. దీంతో గ్రామంలో నేరాల నియంత్రణకు, జాతీయ రహదారిపై జరిగే ప్రమాదాలను నేరుగా గుర్తించేందుకు సీసీ కెమెరాల వల్ల ఎంతో అవకాశం ఉంటుందని ఆశిస్తున్నాం.

– జోగుల రవి, మాజీ సర్పంచ్, ఎర్రవల్లి

దాతలు ముందుకు రావాలి..



గ్రామాల్లో శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాలను అదుపు చేయడం కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నాం. ఆయా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం దాతలు స్వచ్ఛందంగా ముందుకు రావాలి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్న గ్రామాల్లో నిరంతరం పోలీసుల నిఘా నేరుగా ఉన్నట్టే. గ్రామాల్లో జరిగే ప్రతి నేరాన్ని పూర్తి సాక్ష్యాలతో సహా తెలుసుకొని దోషులను గుర్తించేందుకు సులభంగా వీలుంటుంది. జనసంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో జరిగే ప్రధాన నేరాలు, రోడ్డు ప్రమాదాలు, దోపిడీలు జరిగినప్పుడు సీసీ ఫుటేజీలు ఎంతో కీలకంగా పనిచేస్తాయి.

– రవిబాబు, సీఐ, అలంపూర్

పశువులకు వ్యాధి నిరోధక టీకా వేయించండి



పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది



బల్గెరలో పశువులకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

గద్వాల వ్యవసాయం: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా నివారణ టీకాలు వేస్తున్నారు. మండలంలోని జంగంపల్లి, శివపురం పట్టణంలోని హమాలీ కాలనీలో మండల పశువైద్యాధికారి శంకరయ్య పర్యవేక్షణలో 45మంది రైతులకు చెందిన 726 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది తేజస్విని, ప్రభాకర్, గోపాల మిత్రలు పాల్గొన్నారు.

అయిజ: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధిని అరికట్టేందుకు ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న వ్యాధి నిరోధక టీకాలను తప్పకుండా వేయించాలని వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి అన్నారు. గురువారం మండలంలోని సింధనూరు, ఉప్పల క్యాంపు గ్రామాల్లో మొత్తం 667 పశువులకు వెటర్నరీ సిబ్బంది టీకాలు వేశారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ మాట్లాడారు. గాలికుంటు వ్యాధి సోకిన పశువుల నోట్లో, కాలి గిట్టలలో పుండ్లు ఏర్పడుతాయన్నారు. వ్యాధి తీవ్రమైతే పశువులు చనిపోతాయని, వ్యాధి నిరోధక టీకాలు వేయించి పశువులను కాపాడుకోవాలని సూచించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు


గట్టు: మండలంలోని తుమ్మలపల్లి, బల్గెర గ్రామాల్లో గురువారం పశువులకు గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి శంకరయ్య తెలిపారు. రైతులు పశువులకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని తెలిపారు. పశువులు ఆరోగ్యంగా ఉంటే రైతులకు మేలు జరుగుతుందన్నారు. రెండు గ్రామాల్లో మొత్తం 53 మంది రైతులకు చెందిన 231 పశువులకు టీకాలను వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వెటనర్నరీ అసిస్టెంట్ కనకరాజు, పృథ్వీ, గోపాల మిత్రలు పరమేష్‌నాయుడు, ఉరుకుంద, శివశంకర్‌గౌడు, గంగాధర్, రామాంజనేయులు, మల్లేష్ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్లపై పర్యవేక్షణ ఉండాలి

రాజోళి: వేసవి కాలం సందర్భంగా గ్రామాల్లో ఫిల్టర్ నీటి పేరుతో ప్లాంట్లు విచ్చలవిడిగా వెలుస్తున్నాయని, వాటిపై అధికారుల పర్యవేక్షణ ఉండాలని ప్రజలు కోరుతున్నారు. మండల కేంద్రంతో పాటుగా ఆయా గ్రామాల్లో వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉండటంతో, వ్యాపారులు ఈ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నారు. వాటిపై పూర్తి అవగాహన లేకుండా ప్లాంట్లు ఏర్పాటు చేసి నీటిని అమ్ముతున్నారని పేర్కొన్నారు. వాటిపై అధికారులు తనిఖీ చేయడం లేదని తెలిపారు. ఇలా గ్రామాల్లో ఉన్న వాటర్ ప్లాంట్లపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వారు ఇష్టానుసారంగా నీటిని అమ్ముతున్నారని గ్రామాల్లో ప్రజలు పేర్కొంటున్నారు. శుద్ధి చేసిన నీటిని ఫిల్టర్ నీటి పేరుతో అమ్ముతున్న వారిపై అధికారుల చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌కు సన్మానం

ఉండవెల్లి: రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగారి ప్రీతమ్ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంతో ఉండవెల్లి మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దిలేటి, నాయకులు నాగన్నలు గురువారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనను శాలువాతో పూలబొకేతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



ఛైర్మన్‌ను కలిసిన నాయకులు

పలువురిపై కేసు నమోదు

అయిజ: ప్రభుత్వ అధికారుల విధులకు ఆటంకం కలిగించిన సందర్భంగా వేరువేరు సంఘటనల్లో పలువురి వ్యక్తులపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయభాస్కర్ తెలిపారు. మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ జ్యోతి విధులు నిర్వహిస్తుండగా అయిజ పట్టణానికి చెందిన లక్ష్మి, రోహితమ్మ, సుభద్రమ్మ, గోవిందమ్మ, రామేశ్వరమ్మలు కార్యాలయంలోకి ప్రవేశించి తమకు కొత్తపాస్ పుస్తకాలు ఎందుకు ఇవ్వడంలేదని వాగ్వాదం చేశారు. తహసీల్దార్ విధులకు ఆటంకం కల్పించడంతో పాటు వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను చల్లుకొని ఆత్మహత్య చేసుకుంటామని భయభ్రాంతులకు గురి చేశారు. దీంతో వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. వారిని ప్రోత్సహించిన నియామతుల్లాపై, వీడియోను చిత్రీకరించిన గణేష్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వెంకటాపురంలో ఉషా క్లీనిక్‌ను తనిఖీ చేసిన జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ సిద్ధప్ప, ప్రోగ్రాం ఆఫీసర్ స్రవంతిల విధులకు ఆటంకం కలిగించిన ఆర్‌ఎంపీ తిమ్మారెడ్డితో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై ఈ నెల 19న రెండు బైక్‌లు ఢీ కొట్టిన ఘటనలో వృద్ధుడికి గాయాలైన ఘటనలో గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఎస్‌ఐ వివరాల ప్రకారం.. చంద్రశేఖర్ నగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు అనే వ్యక్తిని ఇటిక్యాల మండలం బీవీఆర్ పల్లెకు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌తో ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లుకు కాలు విరిగింది. ఆయన కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ ఎంపీటీసీ

రాజోళి: మండల కేంద్రంలోని ఎంపీటీసీ–2 షాషావలి గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. గతంలో బీఆర్‌ఎస్ పార్టీ తరపున గెలిచిన ఆయన గురువారం హైదరాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు సంపత్ కుమార్ ఆయనకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న రోజుల్లో పార్టీలోకి మరిన్ని చేరికలు ఉంటాయని, ప్రజాప్రభుత్వంగా పేరు తెచ్చుకుంటున్న రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇతర పార్టీల నుంచి భారీగా చేరికలు ఉంటాయని తెలిపారు. స్థానిక సంస్థలు ఇతర ఎన్నికల్లో హస్తమే హవా సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు దస్తగిరి, రషీద్, హసన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఎంపీటీసీ షాషావలికి కండువా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్

విద్యార్థులు ధ్యానంపై దృష్టి సారించాలి



విద్యార్థులకు బ్యాగ్‌లను అందజేసినట్లు నిర్వాహకులు

గట్టు: విద్యార్థులు చదువుతో పాటు ధ్యానంపై దృష్టి సారించాలని హార్ట్‌ఫుల్ నెస్ స్వచ్ఛంద సంస్థ గద్వాల కో ఆర్డినేటర్ లలిత తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు అధ్యాత్మిక ధ్యానానికి సంబంధించిన కరపత్రాలు, బ్యాగ్‌లు అందజేశారు. ఇటీవల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు హైదరాబాద్‌లో గ్లోబల్ స్పిర్చువాలిటీ నిర్వహించిన మహోత్సవంలో పాల్గొన్నట్లు ప్రిన్సిపాల్ శశిధర్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ అతి పెద్ద ధ్యాన కేంద్రం కన్హాశాంతి వనంలో ఈ నెల 15న రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము హాజరై చేసిన ప్రసంగాన్ని కాలేజీ విద్యార్థులు ప్రత్యక్షంగా వీక్షించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ధ్యాన కేంద్రానికి వెళ్లి వచ్చిన విద్యార్థులకు ధ్యానానికి సంబంధించిన కర పత్రాలతో కూడిన బ్యాగ్‌లను సంస్థ నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'పది' పరీక్షలు



ధరూరులో పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థుల సందడి

కేటీదొడ్డి: మండలంలోని పదో తరగతి పరీక్షలు గురువారం ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మండల వ్యాప్తంగా 293 మంది విద్యార్థులకు గాను నందిన్నె, పాతపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నందిన్నెలో 166 మంది విద్యార్థులకు గాను, 164 మంది విద్యార్థులు, పాతపాలెం సెంటర్‌లో 127కు గాను 126 మంది విద్యార్థులు హాజరయ్యారు. ముగ్గురు విద్యార్థులు మాత్రం హాజరు కాలేదని ఎంఈఓ సురేష్ తెలిపారు. ఆయా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు.

పరీక్ష కేంద్రాన్ని రీజినల్ జాయింట్ డైరెక్టర్ తనిఖీ

ఎర్రవల్లిచౌరస్తా: కొండేరు, పదో పటాలంలోని పరీక్ష కేంద్రాలను హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి తనిఖీ చేసి పరీక్ష తీరును పరిశీలించారు. మొత్తం 616 మంది విద్యార్థులకు గాను 614 మంది హాజరైనట్లు మండల విద్యాధికారి రాజు తెలిపారు. ఇటిక్యాల, పదో పటాలంలోని పరీక్ష కేంద్రాలలో ఒక్కొక్కరు చొప్పున విద్యార్థులు గైర్హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు.

మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి ఇంగ్లిష్ పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులు తెలిపారు. పరీక్ష కేంద్రం వద్ద ఎస్‌ఐ చంద్రకాంత్ బందోబస్త్ నిర్వహించారు. పరీక్ష కేంద్రాన్ని ఫ్లయింగ్ స్క్వాడ్ రాజు పరిశీలించారు.

అయిజ: పదో తరగతి పరీక్షల్లో భాగంగా గురువారం ఇంగ్లిష్ పరీక్షను డిపార్ట్‌మెంట్ ఆఫీసర్, చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లు ప్రశాంతంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, ఠాగూర్ హైస్కూల్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బ్రైట్ స్టార్, కృష్ణవేణి హైస్కూల్, మండలంలోని ఉత్తనూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో మొత్తం 986 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 10 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పోలీస్ బృందం పరీక్ష కేంద్రాల వద్ద పహారా నిర్వహించారు.



ఉండవెల్లిలో పది పరీక్ష కేంద్రానికి వెళ్తున్న విద్యార్థినులు

పది పరీక్ష పరిశీలన..

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 137 మంది, ప్రైమరీ పాఠశాలలో 131 మంది, మైనార్టీ గురుకుల పాఠశాలలో 150 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. పరిక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్లు నరేష్, ప్రదీప్ పరిశీలించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ పాల్గొన్నారు.

ధరూరు: పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు ఇంగ్లిష్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. మండలంలో మూడు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. ధరూరులో 265కు గాను, 265 మంది, ఉప్పేరులో 172కు గాను, 171 మంది, మార్లబీడు సెంటర్‌లో 178కి గాను, 177 మంది విద్యార్థులు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపీడీఓ

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండలంలోని పుటాన్‌దొడ్డి గ్రామ పంచాయతీని గురువారం ఎంపీడీఓ అజహర్ మొహియుద్దీన్ సందర్శించారు. ఈ సందర్భంగా వచ్చే ఎంపీ ఎన్నికల దృష్ట్యా గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి తాగునీరు, విద్యుత్, తదితర వసతులను పరిశీలించి ఎన్నికలకు అవసరమైన అన్ని వసతులను కల్పించాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి, బీఎల్‌ఓలు, తదితరులు ఉన్నారు.


మూలమలుపులతో ప్రమాదం



మానవపాడు నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు

- కానరాని సూచిక బోర్డులు
- మూలమలుపుల వద్ద ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

మానవపాడు: మూల మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. మండలంలోని వివిధ గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంట ఉన్న మూల మలుపులు మృత్యు మలుపులుగా మారుతున్నాయి. మలుపులు ప్రమాదకరంగా ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని మండల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధానంగా మండలంలోని గోకులపాడు, మానవపాడు, చెన్నిపాడు, పెద్దపోతులపాడు, చండూరు, పల్లెపాడు, జల్లాపురం, అమరవాయి, నారాయణపురం, పెద్ద ఆముదాలపాడు, బోరవెల్లి, మద్దూరు, కొర్విపాడు తదితర గ్రామాల ప్రధాన రహదారులపై మూల మలుపులు పొంచి ఉన్నాయి. ఈ రహదారులపై ప్రయాణం చేసేటప్పుడు ముందు నుంచి ఏ వాహనం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే ఈ మార్గాల్లో పలు ప్రమాదాలు సంభవించాయి. మూల మలుపుల వద్ద ప్రమాదాలు అవుతున్నాయి.



పెద్దపోతులపాడు నుంచి చెన్నిపాడు మీదుగా మానవపాడు వెళ్లే రహదారి

మలుపుల వద్ద ప్రమాదాలు..

మండల కేంద్రంలోని మానవపాడు నుంచి జాతీయ రహదారికి వెళ్లే దారిలో కాల్వ పక్కన మలుపుతో ప్రమాదాలు సంభవించి ప్రాణాలు కోల్పోయారు. చెన్నిపాడు నుంచి మానవపాడు, పెద్దపోతులపాడుకు వెళ్లే రహదారిపై ప్రమాదాలు ఏర్పడి గాయాలై కొందరు ప్రాణాలు కోల్పోయారు. చండూరు నుంచి జల్లాపురం, పల్లెపాడుకు వెళ్లే రహదారిలో సైతం ప్రమాదాలు సంభవించి కొందరు మంచానికే పరిమితమయ్యారు. బోరవెల్లి నుంచి మానవపాడు వెళ్లే రహదారిలో మూలమలుపు వద్ద సూచిక బోర్డులు లేవు. మానవపాడు మండలకేంద్రం నుంచి గోకులపాడు మీదుగా చంద్రశేఖర్‌నగర్‌కు వెళ్లే రహదారిలో మూలమలుపుల వద్ద ప్రమాదాలవుతున్నాయి. మూల మాలుపుల వద్ద రేడియం, సూచికబోర్డులను ఏర్పాటు చేయాలి. కొర్విపాడు, అమరవాయి గ్రామాలకు వెళ్లే రహదారి వెంట మూలమలుపులున్నాయి. వాటికి సూచికబోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

మలుపుల వద్ద భయం..



రోడ్డుపై ఉన్న మలుపులు వద్ద భయం వేస్తోంది. బైక్‌పై వెళ్తుంటే మలుపుల వద్ద ఎదురుగా వస్తున్న వాహనం కూడా కనిపించదు. దగ్గరకు వచ్చాక కంట్రోల్ తప్పి ఎదురెదురుగా ఢీకొనే ప్రమాదం ఉంది. అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోవాలి.

– కిరణ్‌కుమార్, చెన్నిపాడు

రక్షణ చర్యలు చేపట్టాలి..



జాతీయ రహదారి నుంచి మండల కేంద్రానికి వివి ధ గ్రామాల నుంచి ప్రజలు రకాపోకలు సాగిస్తుంటాయి. మూలమలుపుల వద్ద తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రేడియంతో హెచ్చరిక బోర్డు లు ఏర్పాటు చేయాలి. మూలమలుపుల వద్ద రహదారులు వెడల్పు చేస్తే వాహనదారులు ఇబ్బందులు పడకుండా ఉంటుంది.

– నాగేష్, మానవపాడు